కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద 90 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరంనగర్ కాలనీ హైటెన్షన్ లైన్ కింద నాలా మీద నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, జీహెచ్‌యంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కల్వర్టుతో ప్రయాణ దూరం తగ్గుతుందన్నారు. కల్వర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసి అధికారులు ఏఈ ఆశా, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, మాజీ కార్పొరేటర్ రంగారావు, వివేకానందనగర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్, మోజెస్, వెంకట్ రెడ్డి, చంద్రమోహన్ సాగర్, జగదీష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని కటిక బస్తీకి చెందిన చౌహన్ రాహుల్(24) ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. జనవరి 30వ తేదీన ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన రాహుల్ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. రాహుల్ కోసం పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం రాత్రి కుమారుడి అదృశ్యంపై తండ్రి లాల్‌చాంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ప్రహరీ దగ్గరే పాట్లు

ట్రాఫిక్ జామ్‌లకు కేరాఫ్ పీజేఆర్ స్టేడియం రోడ్డు

హఫీజ్‌పేట్ : పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం గచ్చిబౌలి, నానకరాంగూడ వైపు వెళ్లే ఐటీ ఉద్యోగులు ప్రధానంగా చందానగర్, గంగారం, మదీనాగూడలకు చెందిన వాహనదారులు పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ మీదుగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళతారు. కానీ పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే అక్కడ ప్రహరీ గోడ ఉండడంతో ఒకసారి ఒక వాహనం వెళ్లేందుకే అవకాశం ఉంటుంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో లింగంపల్లి అండర్ బ్రిడ్జి నుంచి పీజేఆర్ స్టేడియం వరకు ట్రాఫిక్‌తో నరకయాతన కనబడుతుందని వాహనదారులు వాపోతున్నారు.


చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద ఇరుకు మారిన రోడ్డు

- పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టాలి
- పీజేఆర్ స్టేడియం ప్రహరీ కొంత మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది.
- రోడ్డు చిన్నదిగా మారడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు.
- రోడ్డుపై గుంతలతో ద్విచక్ర వాహనదారులు సతమతమవుతున్నారు.
- భారీ వాహనాలు రాకుండా కమాన్ ఏర్పాటు చేసినా, ప్రమాదకరమని తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది.

అధికారులకు పలుమార్లు విన్నవించాం


చందానగర్ పీజేఆర్ స్టేడియం ప్రహరీ 5 అడుగుల మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది. వాహన రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ స్థలం కాబట్టి ప్రహరీని కుదిస్తే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టవచ్చు. గతంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, చందానగర్ ఉప కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించాం. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.

– తాడిబోయిన రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

ఇరుకు రోడ్డుతో ఇబ్బంది


చందానగర్ నుంచి గచ్చిబౌలికి వెళ్లే క్రమంలో పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాం. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు విస్తరణ చేయాలి. – శేఖర్, వాహనదారుడు




పీజేఆర్ స్టేడియం వద్ద ఇరుకుదారిలో వాహనాల రాకపోకలు


చందానగర్ పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ వద్ద రోడ్డు ఇరుకుగా మారిన దృశ్యం

డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నిర్వాహకురాలు అనితాఅగర్వాల్, మోడల్స్

మాదాపూర్: డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో శుక్రవారం డిజైర్ డిజైనర్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకురాలు అనితా అగర్వాల్ మోడల్స్ ఇషిక, కుసుమలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరవాసులను ఆకట్టుకునే విధంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ దుస్తులతో పాటు నగర యువతను ఆకట్టుకునే వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడురోజుల పాటు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా శాంతినగర్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు వేమన కాలనీ ఏఈ తెలిపారు.

- 11 కేవీ శాంతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దీప్తిశ్రీనగర్, శాంతినగర్, సువేలా ప్రాజెక్ట్స్, టెక్నో పోలీస్, ధర్మపురి టెంపుల్ రోడ్డు నంబర్స్ 12,13,14 లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : కేంద్రీయవిహార్, రెడ్డికాలనీ ఫీడర్‌ల పరిధిలో.. శనివారం ఉదయం 10.30 నుండి 12.30 గంటల వరకు కేంద్రీయ విహార్, మయూరినగర్ పార్క్, కొలంబస్ స్కూల్, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు బీకే ఎన్‌క్లేవ్, శ్రీజ బృందావన్ కాలనీ, రెడ్డి కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో....

పీఎస్ఆర్ హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, ఆర్‌టీసీ కాలనీ, పీఎస్ఆర్ హిల్స్, అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు ఎఫ్‌సిఐ కాలనీ ఫీడర్ పరిధిలో టాకీటౌన్ ఏరియా, వీడియా కాలనీ, ఎఫ్‌సిఐ కాలనీ, టీఎస్ నగర్ కాలనీ, ఆమాన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

ప్రభలతీర్థం వేడుకలు



శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో ప్రభల తీర్థం వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఉదయం కట్టెల పొయ్యిపై మట్టికుండలలో పాయసం తయారీని ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. వేడుకల్లో భాగంగా పాత పల్లె ఆటలలో సంతోషంగా పాల్గొనడం, వివిధ రకాల వంటలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చందన మాట్లాడుతూ ప్రభల తీర్థం వేడుకలను 2016 నుంచి నిర్వహిస్తున్నామని ఈశ్వరారాధనలో సరోవర్ వాసులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, కార్పొరేటర్లతో కలిసి పెండింగ్ పనులు, పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లు, నాలా, వరదనీటి కాల్వ పనులు, పార్క్ అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, అధికారులు ఎస్‌వి. శంకర్‌నాయక్, ఈఈ శ్రీనివాస్, శ్రీకాంతిని, డీఈ రమేష్, దుర్గాప్రసాద్, శిరీష, విశాలాక్షి, ఏఈలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): సర్పంచ్‌ల పదవీకాలం ముగియటంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీలకు అధికారులను నియమించటంతో వారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ అధికారులు అధికారులను సన్మానించారు.

అభినందన సభ


ఎమ్మెల్యేకు శ్రీకృష్ణుని ప్రతిమను అందజేస్తున్న యాదవ సంఘం సభ్యులు

పటాన్‌చెరు: యాదవుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ కాలనీలోని గోకుల్ ఫంక్షన్‌హాలులో పటాన్‌చెరు యాదవ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, యాదవ సంఘం ప్రతినిధులు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మల్లేష్ యాదవ్, నాగరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

బస్తీ దర్శన్


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో జరుగుతున్న పార్కు సుందరీకరణ పనులను కార్పొరేటర్ పుష్ప నగేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీ సమస్యలను స్థానికులు కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు .కాలనీ అధ్యక్షులు రఘురాంరెడ్డి, కాలనీవాసులు విఠల్, లక్ష్మారెడ్డి, అరుణ్‌సింగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వకుండా పనులు చేయాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్‌టిఆర్‌నగర్ నుంచి పీజేఆర్ నగర్‌కు వెళ్లే సీసీ రోడ్డుకు 50 లక్షల నిధులు మంజూరై, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులైన సీసీ రోడ్డు పనులను శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ సమయంలో లెవెలింగ్ చూసుకొని వర్షపు నీరు నిల్వకుండా చూడాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో భాస్కర్, ఖాజా, వెంకటేష్‌గౌడ్, ఇంతియాజ్, పోశెట్టి గౌడ్, మహేష్, కటిక రవి, మహబూబ్, సాయిగౌడ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ క్లినికల్ హబ్‌గా భారత్

- క్లినికల్ రీసెర్చ్‌లో పురోగతి..
- జనాభాపరంగా క్లినికల్ ట్రయల్స్ పెరగాలి
- ఐఎస్‌సీఆర్ అధ్యక్షులు డా.సనీష్ డేవిస్

సాక్షి, సిటీబ్యూరో: భారత్ వేదికగా అంతర్జాతీయ స్థాయి క్లినికల్ రీసెర్చ్ సేవలను అందించే స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయని 'ఇండియన్ సొసైటీ ఫర్ క్లినికల్ రీసెర్చ్' (ఐఎస్‌సీఆర్) అధ్యక్షులు డా.సనీష్ డేవిస్ తెలిపారు. కానీ క్లినికల్ ట్రయల్స్ మరింతగా పెరగాల్సిన అవసరముందని, జనాభాపరంగా యూఎస్ 25 శాతం, చైనా 7–8 శాతం క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తుంటే భారత్‌లో 3 శాతం మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఐఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్ వేదికగా రెండు రోజుల పాటు కొనసాగే 17వ వార్షిక సదస్సులో దేశంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్లినికల్ పరిశోధకులు, వైద్యులు, పరిశోధనా సంస్థలు పాల్గొని పలు అంశాలపై వర్క్‌షాప్, సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా క్లినికల్ ఆపరేషన్స్, ఎథిక్స్–రెగ్యులేటరీ, అకాడమిక్, క్లినికల్ డెవలప్‌మెంట్, ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ వంటి అధునాతన అంశాలపైన విభిన్న అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని డా.సనీష్ డేవిస్ తెలిపారు. ఇతర దేశాల్లో క్లినికల్ ట్రయల్స్‌లో సాధారణంగా పాల్గొంటారని, ఆ సంస్కృతి ఇక్కడ కూడా రావాల్సిన అవసరముందన్నారు. కరోనా అనంతరం వ్యాక్సిన్, డ్రగ్ తయారీలో క్లినికల్ టర్యల్స్ ప్రాధాన్యత మరింత పెరిగిందని ఐఎస్‌సీఆర్ జనరల్ సెక్రటరీ డా.సీమ తెలిపారు.

క్లినికల్ మెథడాలజీపై శిక్షణ..

క్లినికల్ రీసెర్చ్ వైద్య రంగ అభివృద్ధితో పాటు వేల సంఖ్యలో ఉద్యోగాలను అందిస్తుందని ఐఎస్‌సీఆర్ ట్రెజరర్ అనిర్బన్ రాయ్ ఉద్ఘాటించారు. ఒకప్పుడు ట్రయల్స్ కోసం పేషెంట్లు ఆసుపత్రికి రాగా, ప్రస్తుతం ఆసుపత్రులే పేషెంట్ వద్దకు వెళుతున్నాయన్నాయి. 2005లో దాదాపు 100 వరకు క్లినికల్ రిసెర్చర్లు ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 60 వేలకు చేరిందన్నారు. ఈ రంగంలో భవిష్యత్ దృష్ట్యా క్లినికల్ మెథడాలజీ పై ఇన్‌స్టిట్యూషన్లో, హాస్పిటల్స్‌లో, యూనివర్సిటీల్లో శిక్షణ అందించడానికి కార్యాచరణ చేపట్టామన్నారు.

4 నుంచి 'దస్తకారీ హాత్ సమితి' ఎగ్జిబిషన్

వేదిక కానున్న గచ్చిబౌలి 'నిథమ్'

రాయదుర్గం: హైదరాబాద్ నగరంలో 'దస్తకారీ హాత్ సమితి' ఆధ్వర్యంలో రెండవ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహణకు గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) వేదిక కానుంది. 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు లభిస్తాయి. నిత్యం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఎగ్జిబిషన్‌లో భాగంగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు .. 5వ తేదీ మధుబని పెయింటింగ్, బిహార్..6వ తేదీ గోండ్–మధ్యప్రదేశ్, 7వ తేదీ పట్టచిత్ర –ఒడిశా, 8వ తేదీ క్లేవర్క్–న్యూఢిల్లీ, 9వ తేదీ టెర్రకోట ,న్యూఢిల్లీ వారి వర్క్‌షాపులు జరుగుతాయి.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


సదస్సులో సంఘీభావం తెలుపుతున్న వరప్రసాద్‌రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): దేశ వ్యాప్తంగా కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 16న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ కేవీ జిల్లా మాజీ అధ్యక్షులు వరప్రసాద్‌రెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం బొల్లారంలో కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులను పూర్తిగా విస్మరించిందన్నారు. కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. ఈనెల 16 న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల ప్రజలతో పాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు రాజయ్య, శ్రీధర్‌రావు, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

1.8 కిలోల గంజాయి పట్టివేత

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో జొమాటో డెలివరీ బాయ్ వద్ద 1.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అంజయ్యనగర్‌లో హాస్టల్‌లో నివాసం ఉంటున్న యు.నవీన్(28) జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఓటీ పోలీసులు నవీన్ నుంచి రూ.56 వేల విలువ గల 1.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న 'ఆపరేషన్ స్మైల్'

- సైబరాబాద్‌లో పరిధిలో 11 ప్రత్యేక టీమ్‌ల పర్యవేక్షణ
- స్పెషల్ డ్రైవ్‌లో జనవరిలో 718 మంది పిల్లలు గుర్తింపు


సైబరాబాద్ కమిషనరేట్‌లో మాట్లాడుతున్న డీసీపీ సృజన

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్‌కు మంచి స్పందన వస్తోంది. బాలకార్మికులు, భిక్షాటన, తదితర పనులను చేస్తున్న పిల్లలు, పారిపోయిన వీధి పిల్లలు, బలహీనమైన పిల్లలను రక్షించేందుకు సైబరాబాద్ పోలీసులు 11 ప్రత్యేక ఆపరేషన్ స్మైల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఏడాది పొడవునా పని చేస్తూ ఎప్పటికప్పుడు రక్షించిన పిల్లలను షెల్టర్ హోమ్‌లకు తరలిస్తున్నారు. అందులో భాగంగా జనవరిలో 718 మంది పిల్లలను రక్షించారు. అందులో మనరాష్ట్రానికి చెందిన వారిలో 301 మంది బాలురు, 28 మంది బాలికలుండగా ఇతర రాష్ట్రాలకు చెందిన 360 మంది బాలురు, 29 మంది బాలికలు ఉన్నారు. కాగా బాలకార్మికుల నిర్మూలన, ఇతర అంశాలపై ఫోన్ నెంబర్లు 9490617444, లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సైబరాబాద్ కమిషనరేట్ విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ స్పష్టం చేశారు. అనంతరం స్మైల్ టీమ్‌ల పనితీరుపై ఆమె సమీక్షించారు.



పొగమంచు కప్పేసింది

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఊట్ల, పెద్దమ్మగూడెం, జంగంపేట, నర్రిగూడ గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం పొగ మంచు కమ్ముకుంది. ఉదయం పది గంటల వరకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవటంతో ప్రధాన రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరికొంత మంది ప్రజలు పొగ మంచును చూసి సంబరపడ్డారు.

చిత్రప్రదర్శన



మాదాపూర్: కళాకారుడు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ఆర్కిటెక్ యశ్వంత్ రామమూర్తి తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఎబోడ్స్ ఆఫ్ అడ్మిరేషన్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను ఆయన ప్రారంభించారు. కళాకారులు ఏ విషయాన్ని అయినా చిత్రరూపంలో తెలుపుతారని కొనియాడారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని 43 చిత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 4వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అలేఖ్య హోమ్స్ ఎండి శ్రీనాథ్‌కుర్ర, ఆర్ట్ లవర్ అంజుపొద్దార్ పాల్గొన్నారు.

ఆచరణాత్మక అనుభవమే ప్రగతికి సోపానం

ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సంజయ్

పటాన్‌చెరు: పాఠ్యాంశాలను మొక్కుబడిగా చదివి ఉత్తీర్ణులవడం కంటే ఆచరణాత్మక అనుభవాన్ని పొందడం వల్ల కలిగే ప్రయోజనాలు మిన్న అని, ఆచరణాత్మక అనుభవమే ప్రగతికి సోపానంగా ఎన్ఐటీ వరంగల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ కుమార్ పాండా అభివర్ణించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో '5 జీ నెట్వర్క్‌లో వికేంద్రీకృత కంప్యూటర్ ఇన్ఫ్రాస్టక్చర్ సాధికారత గల వాహన తాత్కాలిక నెట్వర్క్ పాత్రపై శుక్రవారం ఆయన ఉపన్యాసం చేశారు. వాహనాల చలనానికి సంబంధించిన సవాళ్లు, పరిష్కారాల గురించి డాక్టర్ పాండా వివరించారు. ఫాగ్ నోడ్స్ (ఎఫ్ఎన్) ద్వారా శక్తి వినియోగాన్ని తగ్గించడం యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మియాపూర్ : మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీలో 100,101 సర్వేనంబర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హెచ్ఎండీఏ హుడా, రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. హుడా, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మియాపూర్, హుడా పోలీసుల బందోబస్తు మధ్య ఐదు నిర్మాణాల గోడలను జేసీబీతో కూల్చివేశారు. హుడా అసిస్టెంట్ ఎస్టేట్ అధికారి గౌతం, హుడా ఎస్ఐ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ శ్రీను పర్యవేక్షణలో 50 మంది పోలీసులు పహారాలో కూల్చివేతలు నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమ్మోహనం.. నృత్యాభినయం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పోలో భాగంగా శుక్రవారం ఆంపి థియేటర్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నటరాజ కూచిపూడి కళానిలయం గురువు హిమబిందు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో గరుడగమన మండూకశబ్దం, దేవిస్తుతి, జతిస్వరం, అన్నమాచార్య కీర్తన, రామదాసు కీర్తన, శివాష్టకం తదితర అంశాలను అక్షయ, వైష్ణవి, త్రిలోక్య, శ్రీశ్రావణి, శాన్వి గాయత్రి, హంసినీ, కృషికరెడ్డి, దీక్షిత, శ్రీవల్లి ప్రదర్శించారు.